పల్లెపాలెం బీచ్.. పార్కు లేదోచ్..!

- కొత్తపట్నంలోని కె.పల్లెపాలెం బీచ్‌లో నిరుపయోగంగా చిల్డ్రన్స్ పార్కు
- పట్టించుకునే వారు లేక అధ్వానంగా తయారైన పార్కు
- పార్కును బాగుచేసి వాడుకలోకి తీసుకొస్తే ఎంతో ఉపయోగం
- ఒంగోలు, చుట్టుపక్కల ప్రాంతాల నుంచి నిత్యం బీచ్‌కు అధిక సంఖ్యలో పర్యాటకులు
- నిర్లక్ష్యంగా అధికారులు, పాలకులు


చిల్లచెట్లు పెరిగి అధ్వానంగా తయారైన పార్కు

కొత్తపట్నం: కొత్తపట్నంలోని కె.పల్లెపాలెం బీచ్‌కు ఎంతో ప్రాధాన్యత ఉంది. జిల్లా కేంద్రమైన ఒంగోలు నగరానికి అతి చేరువలో ఉన్న ఏకైక బీచ్ ఇదే కావడంతో నిత్యం పర్యాటకులు వస్తుంటారు. ఆదివారాలు, ఇతర సెలవు దినాల్లో పల్లెపాలెం బీచ్ రద్దీగా ఉంటుంది కూడా. అయినప్పటికీ ఈ బీచ్‌లో పర్యాటకులకు ఆహ్లాదాన్ని పంచేందుకు ఎలాంటి ప్రత్యేకతలు లేవు. అసలు కనీస వసతులే లేవంటే అతిశయోక్తి కాదు. చివరకు టూరిజం అభివృద్ధిలో భాగంగా ఏర్పాటు చేసిన చిల్డ్రన్స్ పార్కు కూడా నిరుపయోగంగా మారిందంటే.. ఈ బీచ్‌కు వచ్చే పర్యాటకుల పట్ల అధికారులు, పాలకులు ఎంత నిర్లక్ష్యంగా ఉన్నారో అర్థం చేసుకోవచ్చు.

అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా పార్కు...

కె.పల్లెపాలెం బీచ్‌లో టూరిజాన్ని అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో గతంలో చిల్డ్రన్స్ పార్కు ఏర్పాటు చేశారు. బీచ్ పక్కనే రెండెకరాల స్థలంలో నిర్మించిన చిల్డ్రన్స్ పార్కులో విశ్రాంతి పాకలు, చిన్న చిన్న విగ్రహాలు ఏర్పాటు చేశారు. చిన్నపిల్లలకు ఇష్టమైన రకరకాల బొమ్మలు, తొట్టిలో నీరు నింపి ఆకర్షణీయమైన విన్యాసాలు వంటివాటిని ఉంచారు. సముద్రస్నానం చేసిన తర్వాత చిల్డ్రన్ పార్కులో చిన్నపిల్లలు, తల్లిదండ్రులు ఆహ్లాదంగా గడిపేవారు. అనంతరం తీరిగ్గా తిరుగుముఖం పట్టేవారు. కానీ, ఇదంతా కొద్దిరోజులే జరిగింది. ఆ తర్వాత అధికారులు, పాలకుల పర్యవేక్షణ కరువై పార్కు అధ్వానంగా తయారైంది. క్రమంగా పాడుబడిపోయింది. పట్టించుకునే వారు లేకపోవడంతో చిల్లచెట్లు పెరగడం, చిల్లచెట్ల మధ్యలో కొందరు బహిర్భూమికి వెళ్లడం, విశ్రాంతి పాకల్లో పేకాట, ఇతర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడటం వంటివాటితో పార్కు పూర్తిగా శిథిలావస్థకు చేరింది. అయినప్పటికీ టూరిజం అధికారులు కనీసం ఆవైపు కన్నెత్తి కూడా చూడకపోవడంపై ప్రజలు తీవ్రస్థాయిలో విమర్శిస్తున్నారు. సముద్రతీర ప్రాంతం పక్కన రెండెకరాల్లో పర్యాటకుల కోసం ఏర్పాటు చేసిన పార్కును నిర్లక్ష్యంగా పాడుచేయడంపై పర్యాటకులు మండిపడుతున్నారు.

అభివృద్ధి చేస్తే ఎంతో ప్రయోజనం...

బీచ్ ప్రాంతంలో పాడైపోయిన పార్కును ప్రస్తుతం అభివృద్ధి చేస్తే పర్యాటకులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. పెద్దలకు ఎంతో ఆహ్లాదకరంగా మారి చిన్నపిల్లలకు ఆనందాన్ని కలిగిస్తుంది. బీచ్ ప్రాంతానికే అందం తెచ్చిపెడుతుంది. జర్నీ చేసి బీచ్‌కు వచ్చిన పర్యాటకులు పార్కులో కొద్దిసేపు విశ్రాంతి తీసుకునేందుకు బాగుంటుంది. ప్రస్తుతం బీచ్‌లో ఎలాంటి ప్రత్యేక వసతులు లేనందున పార్కు వలన అనేక ప్రయోజనాలు పొందే వీలుంటుంది. కానీ, పార్కు నిరుపయోగంగా ఉండటం వలన ఉపయోగాలు లేకపోగా, అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారి స్థానికులకు సైతం ఇబ్బందిగా ఉంది. పార్కు మొత్తం చిల్లచెట్లు పెరిగి అడవిని తలపిస్తుండటంతో విషసర్పాలు పెరిగి ఇళ్ల మధ్యలోకి వస్తున్నాయని, కనీసం శుభ్రం చేయించాలని స్థానికులు కోరుతున్నారు. అధికారులు, పాలకులు పట్టించుకుని పార్కును ఉపయోగంలోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేస్తున్నారు.


పార్కులో అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారిన విశ్రాంతి పాక


నిరుపయోగంగా ఉన్న నీటి తొట్టి

శాస్త్రోక్తంగా దుర్గమ్మకు పూజలు


ప్రత్యేక అలంకరణలో కనకదుర్గమ్మ


పాల్గొన్న భవానీ మాలధారులు

ఒంగోలు మెట్రో: స్థానిక నెహ్రూ కాలనీలో దుర్గా మల్లేశ్వరి దేవస్థానంలో గురువారం రాత్రి భక్తిశ్రద్ధలతో కనకదుర్గమ్మకు పూజలు నిర్వహించారు. ఉదయం ఆలయ అర్చకులు అమ్మవారికి సుగంధ పరిమళ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించి వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. దేవి ఖడ్గమాల అష్టోత్తర శతనామాలతో పూజాక్రతువులు వైభవంగా నిర్వహించారు. రాత్రికి కనకదుర్గమ్మకు స్థానిక భవానీ దీక్షధారులతో భజన సంకీర్తనలు నిర్వహించారు. అనంతరం భవానీ దీక్షాధారులు అల్పాహారాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో స్థానిక భక్తులు, భవానీ మాలధారులు పాల్గొన్నారు.

బీచ్ వద్ద భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి

- జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ


పోలీసు అధికారులతో సమావేశం నిర్వహిస్తున్న జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ

ఒంగోలు అర్బన్: కొత్తపట్నం బీచ్ వద్ద పర్యాటకులు, మత్స్యకారులకు భద్రత కల్పించడంలో అత్యంత ప్రాధాన్యమిచ్చి కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ రోణంకి గోపాలకృష్ణ సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రకాశం భవనంలో గురువారం కోస్టల్ సెక్యూరిటీ, అడిషనల్ ఎస్పీ మధుసూదనరావు, అడిషనల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీసు అశోక్‌బాబులతో కలిసి బీచ్ పర్యాటకుల భద్రతపై సమీక్షించారు. దీనిలో జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ బీచ్‌లో స్నానాలు చేసే వారి భద్రతకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఈతగాళ్ల ఏర్పాటు, బోట్లతో పహారా, ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు తదితర చర్యలు తీసుకోవాలన్నారు. ఇస్రో రూపొందించిన పరికరాలను ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం కింద 40–60 శాతం సబ్సిడీతో అందజేస్తున్నట్లు తెలిపారు. సముద్రంలో వేటకు వెళ్లే ఫిషింగ్ బోట్లకు ట్రాన్స్‌పాండర్స్ పరికరాలను బిగించుకోవడం వల్ల తుపాను సమయాల్లో బోట్లు ఏ ప్రాంతంలో ఉన్నది సులువుగా తెలుసుకోవచ్చన్నారు. దీనిపై మత్స్యకారుల్లో అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో కొత్తపట్నం మెరైన్ పీఎస్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సాంబశివరావు, రామాయపట్నం ఇన్‌స్పెక్టర్ శివన్నారాయణ, మత్స్యశాఖ ఎఫ్‌డీఓ, ఎస్‌ఐ సుబ్బారావు, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యలు పరిష్కరిస్తాం


సంతనూతలపాడు : రెవెన్యూ సదస్సు నిర్వహిస్తున్న అధికారులు


చీమకుర్తి : రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్ బ్రహ్మయ్య

- స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, స్పెషల్ ఆఫీసర్ వరకుమార్

సంతనూతలపాడు: రెవెన్యూ సదస్సుల ద్వారా భూ సమస్యలు పరిష్కరిస్తామని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, స్పెషల్ ఆఫీసర్ ఎస్.వరకుమార్ తెలిపారు. సంతనూతలపాడు మండలం వేములపాడు పంచాయతీ పరిధిలోని గొర్లమిట్ట గ్రామంలో గురువారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. సంతనూతలపాడు తహసీల్దార్ వేమూరి ఆదిలక్ష్మి అధ్యక్షత వహించారు. రైతులంతా రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని స్పెషలాఫీసర్ వరకుమార్ కోరారు. గొర్లమిట్ట, మట్టిపాడు గ్రామంలో అధికంగా ఉన్న భూ సమస్యలపై రైతులు అధికారుల ఎదుట ఆందోళన వ్యక్తం చేశారు. త్వరలో వేములపాడు, గొర్లమిట్ట, మట్టిపాడు గ్రామాల్లో రీ సర్వే నిర్వహించి భూ సమస్యలు పరిష్కరించనున్నట్లు తహసీల్దార్ తెలిపారు. భూ సమస్యలపై 37 అర్జీలు దాఖలయ్యాయి. డిప్యూటీ తహసీల్దార్ ఎస్.కె.మాబు సుభాని, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పి.రామ్‌తేజ, వీఆర్వో కే హనుమంతరావు, సర్వేయర్ సంధ్యారాణి, కంప్యూటర్ ఆపరేటర్ ఐ.నాగేశ్వరరావు, గ్రామ ఇన్‌చార్జి కార్యదర్శి కే రామ్మోహన్ రావు, టీడీపీ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

రామచంద్రాపురంలో 10 అర్జీలు...

చీమకుర్తి రూరల్: మండలంలోని రామచంద్రాపురం గ్రామంలో గురువారం జరిగిన రెవెన్యూ సదస్సుకు 10 అర్జీలు వచ్చాయని మండల రెవెన్యూ అధికారి ఆర్.బ్రహ్మయ్య తెలిపారు. వీఆర్వోలు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మోడల్ పరీక్షతో విద్యార్థుల్లో ఆత్మ విశ్వాసం


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎస్ఎఫ్ఐ, యూటీఎఫ్ నాయకులు

చీమకుర్తి: పదో తరగతి మోడల్ పరీక్షల నిర్వహణతో విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని ఎస్ఎఫ్ఐ, యూటీఎఫ్ నాయకులు అన్నారు. ఈ నెల 22న మండల స్థాయిలో నిర్వహించనున్న పదో తరగతి మోడల్ పరీక్షలకు సంబంధించిన కరపత్రాలను గురువారం చీమకుర్తిలోని యూటీఎఫ్ కార్యాలయం వద్ద ఆవిష్కరించారు. కామన్ పరీక్షల ముందు విద్యార్థులలో భయాందోళన పోగొట్టేందుకు మోడల్ పరీక్షలు ఉపయోగపడతాయన్నారు. చీమకుర్తిలోని గౌతమి డిగ్రీ కాలేజీలో నిర్వహించే మోడల్ పరీక్షలలో పదో తరగతి విద్యార్థులు పాల్గొనాలని వారు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు దేవరాజు, యూటీఎఫ్ నాయకులు చలువాది శ్రీనివాసరావు, షేక్ అక్బర్, చల్లా శ్రీనివాసరావు, అంబటి వీరారెడ్డి, స్థానికులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

21న మెగా రక్తదాన శిబిరం

సంతనూతలపాడు: సంతనూతలపాడులో ఈ నెల 21వ తేదీ ఉదయం 10 గంటలకు మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినోత్సవం సందర్భంగా మెగా రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ సంతనూతలపాడు మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ మంత్రి డాక్టర్ మేరుగు నాగార్జున, తదితరులు పాల్గొంటారని చెప్పారు. అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని రక్తదానం చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని చెంచిరెడ్డి కోరారు.

తైక్వాండోలో ఒంగోలు విద్యార్థికి బంగారు పతకం


క్రాంతికుమార్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ పద్మావతి

ఒంగోలు సిటీ: తైక్వాండో పోటీల్లో ఒంగోలు విద్యార్థికి బంగారు పతకం లభించింది. 27వ ఐతా నేషనల్ 1 టీఎఫ్ తైక్వాండో చాంపియన్‌షిప్–2024ను ఈ నెల 14, 15 తేదీల్లో ఒంగ్రిల స్పోర్ట్స్ అకాడమీ న్యూఢిల్లీ వారు నిర్వహించారు. ఈ పోటీల్లో ఒంగోలు అన్నవరప్పాడులోని గుంటూరు ఆక్స్‌ఫర్డ్ హైస్కూల్‌కు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థి దారా క్రాంతికుమార్ గోల్డ్‌మెడల్ సాధించినట్లు ప్రిన్సిపాల్ ఆలా పద్మావతి తెలిపారు. గురువారం హైస్కూల్లో ఏర్పాటు చేసిన సభలో క్రాంతికుమార్‌ను అభినందించారు. తనను తీర్చిదిద్దిన కోచ్ గోలి శ్రీనుకు క్రాంతికుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

మాదిగల సంక్షేమానికి పెద్దపీట


కేక్ కట్ చేస్తున్న మాణిక్యరావు, తదితరులు

ఒంగోలు వన్‌టౌన్: మాదిగల సంక్షేమానికి ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని రాష్ట్ర లిడ్‌క్యాప్ కార్పొరేషన్ చైర్మన్ పిల్లి మాణిక్యరావు అన్నారు. ఒంగోలులోని అంబేడ్కర్ భవన్‌లో ఎంఎస్‌పీఎస్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన సెమీక్రిస్మస్ వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. కొమ్ము సృజన్‌మాదిగ అధ్యక్షత వహించగా, మాదిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ ఉండవల్లి శ్రీదేవి, డీఆర్‌ఓ సీహెచ్ ఓబులేశు, జిల్లా గురుకుల పాఠశాలల కన్వీనర్ దుడ్డు జయ, మెప్మా పీడీ తేళ్ల రవికుమార్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ అర్జున్‌నాయక్, పీటీసీ ఇన్‌స్పెక్టర్ మునిపల్లి రాజేష్, సబ్ ఇన్‌స్పెక్టర్ పూర్ణచంద్రరావు, కొమ్మూరి రవిచంద్ర తదితరులు పాల్గొని అంబేడ్కర్, జగ్జీవన్‌రావు విగ్రహాలకు నివాళులర్పించి కేక్ కట్ చేశారు.

స్మార్ట్ మీటర్లు పగలగొట్టండి

ఒంగోలు టౌన్: నివాస గృహాలకు బిగించే స్మార్ట్ మీటర్లను పగలగొట్టాలని సీపీఎం నగర కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ట్రూ అప్ చార్జీల పేరుతో భారీగా పెంచిన విద్యుత్ చార్జీలకు వ్యతిరేకంగా సీపీఎం చేపట్టిన నిరసనలో భాగంగా గురువారం నగరంలోని 32వ వార్డులో సీపీఎం నగర కమిటీ సభ్యుడు ఎస్‌డీ హుసేన్ అధ్యక్షతన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నగర కార్యదర్శి శ్రీనివాసరావు ప్రసంగిస్తూ సర్దుబాటు చార్జీల పేరుతో ప్రజలపై పెనుభారం మోపడం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నగర కార్యదర్శి మహేష్, బీవీ రావు, షేక్ పీరు, దాసు, టి.సురేష్, రావూరి శ్రీనివాస్, గురవయ్య, షేక్ అబ్దుల్లా, జబ్బార్, చాట్ల సురేష్, షుకూర్ తదితరులు పాల్గొన్నారు.

అమిత్ షా క్షమాపణలు చెప్పాలని వినూత్న నిరసన


నిరసన వ్యక్తం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు


నిరసన వ్యక్తం చేస్తున్న నీలం నాగేంద్రరావు, తదితరులు

ఒంగోలు వన్‌టౌన్: అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన హోం మంత్రి అమిత్ షా వైఖరిని నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో స్థానిక కలెక్టరేట్ వద్ద గల అంబేడ్కర్ విగ్రహం ముందు మోకాళ్లపై కూర్చుని గురువారం వినూత్నంగా నిరసన వ్యక్తం చేశారు. అధ్యక్షత వహించిన కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎస్‌కే సైదా మాట్లాడుతూ భారత రాజ్యాంగం పట్ల అమిత్ షాకు, మోదీకి, బీజేపీకి గౌరవం లేదన్నారు. అంబేడ్కర్‌ను దూషించడం బీజేపీ నాయకులకు అలవాటైందన్నారు. ఈవీఎంల ట్యాంపరింగ్ ద్వారా గత పది సంవత్సరాలుగా అధికారంలోకి వస్తున్న బీజేపీకి ప్రజాస్వామ్యం పట్ల, రాజ్యాంగ నిర్మాత పట్ల గౌరవం లేదన్నారు. చరిత్రను వక్రీకరించి భావితరాలను తప్పుదోవ పట్టించేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాలపర్తి విజేష్‌రాజ్, కై పు వెంకటకృష్ణారెడ్డి, ఎస్‌కే రసూల్, చందు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

అమిత్ షాను మంత్రి పదవి నుంచి తొలగించాలి

అంబేడ్కర్‌ను అవమానించిన అమిత్ షాను మంత్రి పదవి నుంచి తొలగించాలని దళిత హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు నీలం నాగేంద్రరావు డిమాండ్ చేశారు. స్థానిక అంబేడ్కర్ విగ్రహం ముందు గురువారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. దారా అంజయ్య, దేవరపల్లి రమణయ్య తదితరులు పాల్గొన్నారు.


సంతనూతలపాడు: నిరసన వ్యక్తం చేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు

అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన

సంతనూతలపాడు: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై కేంద్ర హోం మంత్రి అమిత్ షా పార్లమెంట్లో చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా మండలంలోని చంద్రపాలెంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద గురువారం నిరసన వ్యక్తం చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు నెరుసుల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ భరతజాతి ముద్దు బిడ్డ అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం క్షమించరాని నేరమన్నారు. అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం రాజ్యాంగాన్ని అవమానపరిచినట్లేనని అన్నారు. దీనిపై అమిత్ షా క్షమాపణలు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి అన్నవరపు శేషారావు, నాయకులు పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషి

కొత్తపట్నం: పెన్షనర్ల సమస్యలు పరిష్కరించేందుకు పెన్షనర్ల కమిటీ సిద్ధంగా ఉందని మండల పెన్షనర్ల సంఘ అధ్యక్షుడు ఉద్దగిరి జాలయ్య అన్నారు. జాతీయ పెన్షనర్ల దినోత్సవంలో భాగంగా గురువారం కొత్తపట్నం గ్రామంలోని పెన్షనర్ల భవనంలో నిర్వహించిన కార్యక్రమానికి జాలయ్య అధ్యక్షత వహించి మాట్లాడారు. పెన్షనర్ల స్థితిగతులను వివరించారు. అనంతరం సీనియర్ సిటిజన్లు ఏ.రాఘవయ్య, ఎస్‌వీ నారాయణరెడ్డి, శెట్టి కోటేశ్వరరావు, ఇండ్ల సుబ్బారావు, ఆర్ఎల్ఎన్ ప్రసాద్, డాకా పిచ్చిరెడ్డి, వై.రామారావులను సన్మానించారు. మండల పెన్షనర్ల సంఘ కార్యదర్శి గడ్డం మురహరిరావు ఎస్టీలకు చేసిన సేవలను గుర్తించి ఇండ్ల సుబ్బారావు సన్మానించి అభినందించారు. ఉద్దగిరి జాలయ్య సొంత నిధులతో అన్నదానం చేశారు. ఎస్సై వి.సుధాకర్‌బాబును సన్మానించారు. ఎస్.కోటేశ్వరరావు, చాపల చిరంజీవి, బలగాని యానాదిరావు, ఆదాము, యేసుదాసు, విజయభాస్కర్ రావు, సోమరాజు, డి.వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ఎస్సై సుధాకర్‌బాబును సన్మానిస్తున్న జాలయ్య, మురహరిరావు, పెన్షనర్లు

సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై అవగాహన అవసరం


కొత్తపట్నంలో మాట్లాడుతున్న కేశవరెడ్డి


సంతనూతలపాడులో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్న అధికారులు


అవగాహన కల్పిస్తున్న ఈఓఆర్డీ అజిత

చీమకుర్తి రూరల్: సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై సచివాలయ సిబ్బందికి గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈఓఆర్డీ పి.అజిత అధ్యక్షతన స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గ్రామాల్లో చేపట్టవలసిన పనులను గుర్తించి, పంచాయతీల జనరల్ ఫండ్ ద్వారా భావితరాలకు ఉపయోగపడే రీతిలో అభివృద్ధికి పాటుపడాలని అధికారులు కోరారు. గ్రామ పంచాయతీల అభివృద్ధి, ఆదాయం, లక్ష్యాల సాధనపై మాస్టర్ ట్రైనర్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శాంతిప్రియ, పీఆర్ ఏఈ సునీల్ శిక్షణ ఇచ్చారు. గ్రామ పంచాయతీల్లో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రామాల్లో తాగునీటి సమస్య, డ్రైనేజీ సమస్యలను పరిష్కరించడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా అందుతున్న పథకాలను వివరించారు. కార్యక్రమంలో ఏవో వి.శ్రీనివాసరావు, కార్యదర్శులు సుబ్బయ్య, వెంకటేశ్వర్లు, సచివాలయ సిబ్బంది, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

సంతనూతలపాడులో...

సంతనూతలపాడు: గ్రామాల అభివృద్ధికి ప్రతిఒక్కరూ నడుం బిగించాలని ఎంఈఓ డి.వెంకారెడ్డి కోరారు. సంతనూతలపాడు మండల పరిషత్ కార్యాలయంలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై రెండో బ్యాచ్‌కి నిర్వహిస్తున్న శిక్షణ తరగతులు గురువారంతో ముగిసాయి. ఎంపీడీవో డి.సురేష్‌బాబు పర్యవేక్షణలో ఈ నెల 16, 17, 18, 19 తేదీల్లో రెండు బ్యాచ్‌లుగా సర్పంచులు, కార్యదర్శులు, వీఆర్వోలు, సచివాలయ సిబ్బందికి సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై శిక్షణ తరగతులు నిర్వహించారు. వివిధ శాఖల అభివృద్ధి, వాటి పనితీరు, తదితరాలపై అధికారులు శిక్షణ ఇచ్చారు. ప్రభుత్వ ఉద్యోగులందరూ ప్రజాసేవకులని, ప్రజలకు మనం అందించే సేవల ద్వారా ప్రభుత్వానికి, మనకి మంచి పేరు వస్తుందని ఎంఈఓ వెంకారెడ్డి అన్నారు. అవినీతి లేని సేవలను ప్రజలకు అందించాలన్నారు. పారదర్శకత, జవాబుదారీతనంతో విధులు నిర్వహించాలన్నారు. ప్రతిఒక్కరూ ప్రజలకు తమ వంతుగా సేవలందించాలన్నారు. వెలుగు ఏపీఎం టి.బాబూరావు, మండల పరిషత్ ఏవో ఈదర విజయలక్ష్మి, రిసోర్స్‌పర్సన్లు పి.రవికుమార్, సీహెచ్‌ఓ ఆర్.ప్రసాద్ తదితరులు శిక్షణ తరగతులలో మాట్లాడారు. ప్రొజెక్టర్ ద్వారా వివిధ రంగాల అభివృద్ధిపై శిక్షణ తరగతులు నిర్వహించారు. తొలుత గాంధీజీ, అంబేడ్కర్ చిత్రపటాలకు నివాళులర్పించారు.

కొత్తపట్నంలో...

కొత్తపట్నం: మండలంలోని అన్ని గ్రామాలు అభివృద్ధి చెందే విధంగా ప్రణాళిక తయారు చేయాలని ఏపీఎస్ఎల్ఆర్డీ డైరెక్టర్ ఆర్.కేశవరెడ్డి సూచించారు. ఎల్ఎస్‌డీజీపై నాలుగు రోజుల నుంచి నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమం గురువారంతో ముగిసింది. కేశవరెడ్డి పాల్గొని మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు కూర్చుని గ్రామాభివృద్ధికి అవసరమైన ప్రణాళికలు తయారు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీకృష్ణ, ఈవోఆర్డీ గోపాలకృష్ణమూర్తి, ఖాజావలి, ఆర్‌డబ్ల్యూఎస్ వంశీకృష్ణారెడ్డి, ఏఈ శ్రీనివాసులు, అధికారులు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు విగ్రహానికి అడ్డంగా ట్రాఫిక్ పోస్టు తొలగించాలి

ఒంగోలు టౌన్: నగరంలోని మంగమూరుడొంక బైపాస్ జంక్షన్‌లో అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహానికి అడ్డంగా ఉంచిన పోలీసు పోస్టును తొలగించాలని పొట్టి శ్రీరాములు అభిమాన సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు నాగాంజనేయులు గురువారం ఒక ప్రకటనలో కోరారు. ఇటీవల ట్రాఫిక్ పోలీసులు ఈ విగ్రహం వద్ద పోలీసు పోస్టు ఏర్పాటు చేశారని, దాంతో విగ్రహం కనిపించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని ఎస్పీ దామోదర్ దృష్టికి కూడా తీసుకెళ్లినట్లు తెలిపారు. ఆ తర్వాత విగ్రహం వద్ద కట్టిన ఫ్లెక్సీలు తొలగించారని, పోస్టు కూడా తీసివేయాలని కోరారు. డిసెంబర్ 15వ తేదీ పొట్టి శ్రీరాములు ఆత్మ బలిదానం రోజు జరపుకునేందుకుగా.. ముందుగానే డిసెంబర్ 2వ తేదీ గ్రీవెన్స్‌లో ఎస్పీని కలిసినట్లు తెలిపారు. అయినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని, ట్రాఫిక్ పోలీసు స్టేషన్‌కు వెళ్తే సిబ్బంది నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారని, ట్రాఫిక్ సీఐకి ఫోన్ చేస్తే లిఫ్ట్ చేయడం లేదని వివరించారు.



పొట్టి శ్రీరాములు విగ్రహానికి అడ్డంగా ఏర్పాటు చేసిన పోలీసు పోస్టు

దివ్యాంగురాలి ఉపాధికి చేయూత

ఒంగోలు సిటీ: తెలంగాణ రాష్ట్రం ఖమ్మం జిల్లా పెద్దబీరపల్లి గ్రామానికి చెందిన ఇండ్ల వరలక్ష్మి అనే దివ్యాంగురాలికి టీ, టిఫిన్ హోటల్ పెట్టుకుని జీవనం కొనసాగించేందుకు స్థానిక సూర్యశ్రీ ట్రస్ట్ చేయూత అందించింది. హోటల్‌కు అవసరమైన సామగ్రి అందించినట్లు ట్రస్ట్ సెక్రటరీ సర్దార్‌బాషా గురువారం తెలిపారు.